సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

9705347494

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

నేత్రపర్వం.. అమ్మరూపం



తమలపాకులు, చెక్కల అలంకరణలో రాస పోలమాంబ

తమలపాకులు, చెక్కలు, బంతి, చామంతి, వేపాకుల అలంకరణలో మజ్జివలస గ్రామ దేవత రాస పోలమాంబ అమ్మవారు నేత్ర పర్వంగా దర్శనమిచ్చారు. ఈ అలంకరణకు కుప్ప రాసయ్య, లక్ష్మి, సన్యాసిరావు, రాజేశ్వరి సహాయ సహకారాలు అందించారు.

– తగరపువలస

రైతులు నిర్దిష్ట గుర్తింపు సంఖ్య పొందాలి

పద్మనాభం: రైతులందరూ నిర్దిష్ట గుర్తింపు సంఖ్య పొందాలని మండల వ్యవసాయ శాఖ అధికారి ఎంపీఎస్ చలం ఒక ప్రకటనలో కోరారు. ఈ నంబర్ ఉన్నవారు ప్రభుత్వ పథకాలను పొందవచ్చని పేర్కొన్నారు. ఈ నంబర్ పొందదలుచుకున్న రైతులు ఆధార్ కార్డు, ఆధార్ కార్డు లింక్ అయిన మొబైల్ నంబర్, పట్టాదారు పాస్ పుస్తకం జిరాక్సు కాపీలను తీసుకుని రైతు సేవా కేంద్రాలకు వెళ్లాలని సూచించారు.

రోడ్డుపైనే రేషన్ పంపిణీ



శివశక్తినగర్ రోడ్డులో రేషన్ సరకుల కోసం క్యూలో ఉన్న కార్డుదారులు

మధురవాడ: జీవీఎంసీ 5వ వార్డు శివశక్తి నగర్ రోడ్డు అయ్యప్పనగర్ వద్ద రోడ్డుపైనే రేషన్ పంపిణీ చేశారు. కార్డుదారులు మండుటెండలో క్యూలో నిలబడి రేషన్ తీసుకోవలసి వచ్చింది. ఇది కొండవాలు ప్రాంతం అయినా, అందుబాటులో ఉన్న ప్రదేశానికి కూడా వాహనం తీసుకు వెళ్లకుండా స్వయంకృషి నగర్, అయ్యప్పనగర్ పరిసర ప్రాంతాలకు చెందిన వారికి ఇలా రేషన్ ఇస్తున్నారు. కొందరు ఎండలో క్యూలో నిలబడలేక పక్కనే ఉన్న దుకాణం నీడలో సేదతీరారు.

ఎమ్మెల్సీ ఓటర్లు 250 మంది



పోలింగ్ జరిగే ఎగువపేట ప్రాథమికోన్నత పాఠశాల

భీమునిపట్నం: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి భీమిలి పరిధిలో మొత్తం 250 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 151మంది కాగా, స్త్రీలు 99 మంది ఉన్నారు. ఇందుకోసం ఇక్కడ ఎగువపేట ప్రాథమికోన్నత పాఠశాలను పోలింగ్ కేంద్రంగా కేటాయించారు. ఈ నెల 27న ఎన్నికలు జరగనున్నాయి.

ప్రహరీ స్థలంపై వివాదం



టూరిజం అధికారులతో స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ రామదాస్

కొమ్మాది: ప్రముఖ పర్యాటక ప్రాంతం రుషికొండ బీచ్ ప్రాంతంలో స్థల వివాదం ఏర్పడింది. బీచ్ వద్ద టూరిజంకు సంబంధించిన స్థలానికి, దీనికి పక్కగా ఉన్న శివాలయానికి సంబంధించిన స్థలానికి మధ్య గతంలో ప్రహరీగోడ నిర్మించారు. ప్రస్తుతం శివాలయ నిర్వాహకులు ఓ దుకాణం ఏర్పాటు చేశారు. ఈ దుకాణానికి ప్రహరీ అడ్డుగా ఉండటంతో తొలగించేందుకు ఆలయ నిర్వాహకులు సన్నద్ధమయ్యారు. అయితే ఇది టూరిజంది అని అధికారులు, శివాలయానిదే అని నిర్వాహకులు వాగ్వాదానికి దిగారు. దీంతో ఈ సమస్య ఆరిలోవ పోలీస్‌స్టేషన్‌కు చేరింది. ఈ క్రమంలో ఎస్ఐ రామదాస్ మంగళవారం అక్కడికి చేరుకుని స్థలాన్ని పరిశీలించారు. ఇరువర్గాల వారు తమ డాక్యుమెంట్లను చూపించాలని, తరువాత పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

ప్రారంభం కాని రెడ్డిపల్లి తారు రోడ్డు పనులు

ధూళి రేగడంతో స్థానికుల అవస్థలు

ఆగ్రహం వ్యక్తం చేస్తున్న నారీమణులు

తమ గ్రామానికి సరైన రోడ్డు లేక అవస్థలు పడుతున్న రెడ్డిపల్లి మహిళలు గతేడాది డిసెంబర్ 31న ధర్నా చేశారు. దాదాపు 3 గంటల పాటు ట్రాఫిక్ స్తంభించిపోవడంతో దిగి వచ్చిన అధికారులు జనవరి 20న తారు రోడ్డు వేస్తామని హామీ ఇచ్చారు. గడువు తేదీ దాటి 20 రోజులు అయినా ఆర్ అండ్ బీ అధికారులు ఆ హామీ నెరవేర్చలేదు. దీనిపై అతివలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మాట నిలబెట్టుకోని అధికారుల తీరుపై ఆందోళనకు సమాయత్తమవుతున్నారు.

రెడ్డిపల్లి రోడ్డుపై మాట తప్పారు



రోడ్డు కోసం రెడ్డిపల్లిలో ధర్నా చేస్తున్న మహిళలు(ఫైల్)



ధూళి రేగుతున్న రోడ్డు



పోస్టాఫీసు వద్ద గోతులమయమైన రోడ్డు



తారు వేయకుండా తాత్కాలికంగా మట్టితో కప్పి వదిలేసిన రోడ్డు

పద్మనాభం: రెడ్డిపల్లి రోడ్డును తారుతో అభివృద్ధి చేస్తామని ఆర్ అండ్ బీ అధికారులు ఇచ్చిన హామీ నెరవేర్చలేదు. దీంతో మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. శేరిఖండం నుంచి రెడ్డిపల్లి శాంతినికేతన్ వరకు సుమారు రూ.3 కిలోమీటర్లు నిడివి గల రోడ్డు గోతులు పడి చాలా ఇరుకుగా ఉండేది. దీంతో రోడ్డు అభివృద్ధికి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.10.04 కోట్లు మంజూరు చేసింది. రోడ్డును తారుతో అభివృద్ధి చేయడంతో పాటు 12 అడుగులున్న రోడ్డును 40 అడుగులకు విస్తరించడానికి, కల్వర్టులు నిర్మించడానికి ఈ నిధులు మంజూరు చేశారు. రెడ్డిపల్లిలో ఇరుగ్గా ఉన్న రోడ్డును విస్తరించడానికి రోడ్డుకిరుపక్కలా ఉన్న ఇళ్లను తొలగించారు. శేరిఖండం వద్ద కల్వర్టు కట్టారు. ఇంతలో ఎన్నికలు రావడంతో పనులు ఆగిపోయాయి. తర్వాత వచ్చిన కూటమి ప్రభుత్వం రోడ్డు గురించి పట్టించుకోలేదు.

రాళ్లు తేలి.. గోతులమయమై..

రోడ్డు గోతులు పడడంతో వర్షాల్లో చెరువును తలపించేది. ఈ రోడ్డుపై విజయనగరం, సింహాచలం వెళ్లే బస్సులు ఆటోలు, లారీలు, ద్విచక్ర వాహనాలు తిరుగుతుంటాయి. రోడ్డు రాళ్లు తేలిపోవడంతో ద్విచక్ర వాహనచోదకులు అదుపు తప్పి గోతుల్లో పడి ప్రమాదాల పాలయ్యేవారు. ఆటోలు, బస్సులు నడపానికి డ్రైవర్లు ఇబ్బందులు పడేవారు.

ధూళి రేగుతోంది

బీటీ వేయకుండా మట్టి వేసి వదిలేయడంతో వాహనాలు వెళ్తే ధూళి రేగుతోంది. దీనివల్ల ఈ రోడ్డుపై రాకపోకలు సాగించడానికి ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. ముక్కుకు రుమాళ్లు కట్టుకుని కొందరు, ముక్కు మూసుకుని మరికొందరు రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

డిసెంబర్ 31న ధర్నా

రోడ్డు అభివృద్ధి చేయాలని సుమారు వందమందికి పైగా మహిళలు డిసెంబర్ 31వ తేదీన రామాలయం ముందు రోడ్డుపై ధర్నా చేశారు. ఉదయం ఎనిమిది గంటల నుంచి 11 గంటల వరకు ధర్నా చేశారు. మూడు గంటల పాటు ట్రాఫిక్ స్తంభించింది. దీంతో పోలీసులు రంగప్రవేశం చేసి ధర్నాను విరమింపజేయడానికి శత విధాల ప్రయత్నించారు. కానీ మహిళలు వెనక్కి తగ్గలేదు. రోడ్డు అభివృద్ధి చేస్తామని స్పష్టమైన హామీ ఇస్తేనే ధర్నా విరమిస్తామని స్పష్టం చేశారు. సీఐ సీహెచ్ శ్రీధర్ ఆర్అండ్‌బీ డీఈఈ రంగరాజుతో ఫోన్‌లో మహిళలతో మాట్లాడించారు. ముందుగా తక్షణమే మట్టితో గోతులు పూడ్చుతామని, జనవరి 20 నుంచి తారు రోడ్డు పనులు చేపడతామని డీఈఈ మహిళలకు ఫోన్‌లో హామీ ఇచ్చారు. జనవరి 20 నుంచి తారు రోడ్డు పనులు ప్రారంభించకపోతే 21న మళ్లీ ధర్నాకు దిగుతామని మహిళలు డీఈఈతో చెప్పారు. 20 నుంచి తప్పనిసరిగా రోడ్డు పనులు ప్రారంభిస్తామని డీఈఈ హామి ఇవ్వడంతో మహిళలు ధర్నాను విరమించారు. కొంతమేర రోడ్డుపై గోతులను మట్టితో పూడ్చారు. తారు రోడ్డు పనులు మాత్రం ప్రారంభించలేదు.

ధర్నాకు సమాయత్తం

పనులు ప్రారంభించక పోవడంతో మళ్లీ ధర్నా చేయడానికి మహిళలు సిద్ధమయ్యారు. ఈ విషయం పైకి పొక్కడంతో రోడ్డు పనులు ప్రారంభిస్తామని, ధర్నా చేయవద్దని అధికారులు చెప్పడంతో మహిళలు వేచి చూశారు. హామీ ఇచ్చి 22 రోజులు కావస్తున్నా తారు రోడ్డు పనులు ప్రారంభించకపోవడంతో వారు ధర్నాకు సమాయత్తమవుతున్నారు.

ధూళి ఇళ్లలోకి వచ్చేస్తోంది



రోడ్డుపై గోతులను యాతపేట సమీపంలో మట్టితో కప్పారు. విజయనగరం, సింహాచలం వెళ్లే బస్సులు, లారీలు, ఆటోలు నిరంతరం ఈ రోడ్డుపై తిరుగుతూ ఉంటాయి. తారు రోడ్డు వేయకపోవడంతో వాహనాలు వెళ్లి ధూళి రేగి, ఇళ్లలోకి వచ్చేస్తుంది. ఇళ్లలో కూడా ఉండలేకపోతున్నాం.

– జి.అప్పయ్యమ్మ, రెడ్డిపల్లి

హామీ నెరవేర్చలేదు



జనవరి 20 నుంచి తారురోడ్డు పనులు ప్రారంభిస్తామని అధికారులు చెప్పారు. ఇప్పటికీ పనులుప్రారంభించలేదు. రోడ్డుకు అనుసంధానంగా ఉండే డ్రైనేజీలను విస్తరణ కోసం తవ్వేశారు. దీంతో నీరు పైకి వెళ్లకుండా ఎక్కడికక్కడే ఇళ్ల వద్ద ఉండి పోతుంది. ఈగలు, దోమలతో కంటి మీద కునుకు ఉండట్లేదు.

– బి.ఆదమ్మ, రెడ్డిపల్లి

మూడు సచివాలయాల ఆకస్మిక తనిఖీ



బి.ఆర్.తాళ్లవలస సచివాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీవో విజయ కుమార్

పద్మనాభం: మండలంలోని మూడు సచివాలయాలను ఎంపీడీవో ఎం.విజయ కుమార్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. బి.ఆర్.తాళ్లవలస, కోరాడ, రేవిడి సచివాలయాలను పరిశీలించి, ఉద్యోగులు నిర్ణీత సమయానికి హాజరవుతున్నారో లేదో ఆరా తీశారు. గ్రామ పంచాయతీలకు సంబంధించి రికార్డులను పరిశీలించారు. ప్రభుత్వ సర్వేలను త్వరితగతిన పూర్తి చేయాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించారు.

ఎస్‌డబ్ల్యూపీసీల పరిశీలన

మండలంలోని బాందేవుపురం, గంధవరం గ్రామాల్లోని చెత్త నుంచి సంపద ఉత్పత్తి కేంద్రాల(ఎస్‌డబ్ల్యూపీసీ)ను ఈవోఆర్డీ మీనాకుమారి పరిశీలించారు. వీటిని వినియోగంలోకి తేవాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు.

అథ్లెటిక్స్‌లో రాంబాబు ప్రతిభ



పతకాలతో రాంబాబు

పద్మనాభం: అనంతపురంలో ఈ నెల ఏడు నుంచి తొమ్మిది వరకు జరిగిన రాష్ట్ర స్థాయి మాస్టర్ అథ్లెటిక్ చాంపియన్ షిప్ పోటీల్లో పద్మనాభం మండలం అనంతవరం గ్రా మానికి చెందిన కె.రాంబాబు మూడు బంగారు పతకాలు సాధించారు. వంద, రెండు వందలు, నాలుగు వందల మీటర్ల పరుగు పందెంలో రాంబాబు ప్రతిభ చూపి, ఈ పతకాలు సాధించారు. రాంబాబు ఏపీఎస్ఆర్టీసీలో కండక్టర్‌గా చేస్తున్నారు.

‘చంద్రంపాలెం’ విద్యార్థినులకు స్పోర్ట్స్ కిట్ల పంపిణీ



స్పోర్ట్స్ కిట్లతో చంద్రంపాలెం హైస్కూల్ విద్యార్థినులు


మధురవాడ: చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన సుమారు 457మంది విద్యార్థినులకు నాంది ఫౌండేషన్ స్పోర్ట్స్ కిట్లు పంపిణీ చేసింది. ఈ కిట్‌లో టీ షర్ట్, సాక్స్, షూ, పుస్తకాలు, శానిటరీ నాప్‌కిన్స్ తదితర రూ.3 వేల విలువైన సామగ్రి ఉన్నాయని నిర్వాహకులు తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి. రవి చేతుల మీదుగా వీటిని విద్యార్థినులకు మంగళవారం అందజేశారు. ఈ సామగ్రి తీసుకురావడంలో కృషి చేసిన ఎస్.సోమేష్‌ను హెచ్‌ఎం, ఇతర ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో పూర్వ ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు ఎస్‌వీఎస్ సోమయాజులు, మధుసూదనరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సీబీఎం హైస్కూల్ విద్యార్థులకు..

భీమునిపట్నం: భీమిలిలోని సీబీఎం ఎయిడెడ్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు స్పోర్ట్స్ కిట్లు పంపిణీ చేశారు. పాఠశాలలో ఎంపిక చేసిన 75 మంది విద్యార్థులకు వీటిని అందజేశారు. పాఠశాల కరస్పాండెంట్ పి.ఎ.విజయకుమారి, ఇదే ఆవరణలో ఉన్న బీజీఎం పాఠశాల కరస్పాండెంట్ పి.ఎస్.చంద్, నాంది ఫౌండేషన్ ప్రతినిధి నరేంద్రకుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శ్రీరాముడు రాశీభూతమైన ధర్మం

బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు



మధురవాడ: రాక్షసుడైన మారీచుడే శ్రీరాముడిని రాశీభూతమైన ధర్మముగా అభివర్ణించాడని ప్రముఖ ప్రవచనకర్త బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు తెలిపారు. అతడు భీతి,భక్తి చేత రామోపాసన చేసి ఒక రుషిగా మారిపోయాడని వాల్మీకి మహర్షి రామాయణంలో పేర్కొన్నారన్నారు. మధురవాడ గాయత్రి విద్యాపరిషత్ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో జరుగుతున్న సంపూర్ణ శ్రీరామాయణ ప్రవచనాల్లో భాగంగా 18వ రోజు, మంగళవారం అరణ్యకాండపై చాగంటి ప్రవచించారు. మారీచుడు రావణాసురుడి చేతిలో కంటే రాముడి చేతిలో మరణించడమే మేలని నిర్ణయించుకోవడం, సీతమ్మ మాయలేడి కావాలని అడగడం, రాముడు దానిని తేవడానికి వెళ్లడం, లక్ష్మణుని సీత నిందించడం, నిందా వాక్యములు భరించలేక లక్ష్మణుడు శ్రీరాముని కోసం వెళ్లడం, అతనిని చూసి శ్రీరాముడు ఆశ్చర్యపోవడం వరకు వివరించారు. కార్యక్రమంలో నిర్వాహకులు, అష్టలక్ష్మీ దేవాలయం ధర్మకర్త అన్నంరాజు సత్యనారాయణమూర్తి, గాయత్రి విద్యాపరిషత్ కార్యదర్శి ఆచార్య సోమరాజు, ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతపై పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ మంజుల, అధ్యాపకులు

భీమునిపట్నం: భీమిలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్.విష్ణుమూర్తి రచించిన ‘విమెన్ ఎంపవర్‌మెంట్ త్రూ సెల్ఫ్‌హెల్ప్ గ్రూప్స్’ పుస్తకాన్ని మంగళవారం ఆవిష్కరించారు. కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ మంజుల ఈ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంచి పుస్తకాన్ని రచించిన విష్ణుమూర్తిని ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు. ఇదే స్ఫూర్తితో మరిన్ని పుస్తకాలను రచించాలని ఆకాంక్షించారు.

పీడీఎఫ్ అభ్యర్థి గెలుపునకు ప్రచారం

మధురవాడ: విద్యావంతులు, ఉపాధ్యాయుల వాణిని వినిపించేందుకు ప్రోగ్రెసివ్ డెమోక్రటిక్ ఫెడరేషన్ అభ్యర్థిని కోరెడ్ల విజయ గౌరిని ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా గెలిపించాలని సీఐటీయూ ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్ కోరారు. మధురవాడ, మారికవలస పరిసర ప్రాంతాలలోని పలు పాఠశాలలో మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మొదటి నుంచీ ప్రజలు, ఉపాధ్యాయుల సమస్యలపై పోరాటాలు నిర్వహించిన వ్యక్తి విజయగౌరి అని చెప్పారు. ఉపాధ్యాయులంతా ఆమెకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజార్టీ చేకూర్చాలని కోరారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు డి.అప్పలరాజు రఘుపతి వెంకటరమణ, పి.రాజుకుమార్, బి.భారతి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలు నెరవేర్చాలి



మాట్లాడుతున్న సీపీఐ ఏరియా కార్యదర్శి రాంబాబు

తగరపువలస: ఎన్నికల హామీలను కూటమి ప్రభుత్వం నెరవేర్చాలని భీమిలి ఏరియా సీపీఐ కార్యదర్శి కానూరి రాంబాబు డిమాండ్ చేశారు. స్థానిక గుజ్జు రామునాయుడు భవన్‌లో మంగళవారం ఆయన మాట్లాడారు. ఎన్నికలకు ముందు చంద్రబాబు అర్హులైన పేద ప్రజలకు అర్బన్‌లో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతంలో మూడు సెంట్లు స్థలాలు ఇస్తానన్నారని గుర్తు చేశారు. అలాగే అన్ని రకాల పింఛన్లు త్వరితగతిన అందించాలన్నారు. గ్రామ, వార్డు సచివాలయాలలో సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. ప్రజలకు సేవలు అందించకపోగా దుర్భాషలాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మోర అప్పలరాజు, నాయకులు ఆదినారాయణ, సన్నిబాబు, లక్ష్మణ రావు తదితరులు పాల్గొన్నారు.

ఘంటసాలకు ఘన నివాళులు



ఘంటసాలకు నివాళులు అర్పిస్తున్న పాటల పందిరి సీనియర్ సిటిజన్స్

పీఎం పాలెం: ప్రఖ్యాత సినీ నేపథ్య గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు వర్ధంతి సందర్భంగా జాతర వాకర్స్ పాటలపందిరి సభ్యులు ఆయన చిత్రపటం వద్ద ఘన నివాళులర్పించారు. శిల్పారామం (జాతర)లో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఘంటసాల ఆలపించిన మరపురాని మధురగీతాలను మహేశ్వరరావు, రామ్ ప్రసాద్, భాస్కరరావు, వాణి, సుజాత ఆలపించారు. కార్యక్రమంలో నారాయణ స్వామి, గోవింద్, అప్పలనాయుడు,రామారావు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో ముగ్గురు దొంగలు

తగరపువలస: దారి కాచి దోపిడీకి పాల్పడుతున్న ముగ్గురు దొంగలను భీమిలి క్రైం పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. వివరాలివి.. భీమిలి మండలం దాకమర్రి శివారులో విజయనగరం వైపు వెళ్తున్న ముగ్గురు వాహనదారులను అడ్డుకుని రూ.వెయ్యి దోచుకున్న సంఘటన సోమవారం రాత్రి జరిగింది. బాధితుడు లీలా వరప్రసాద్ ఈ మేరకు మంగళవారం భీమిలి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అల్పాహారం కోసం దాకమర్రి వద్ద ఆగిన తాము మూత్ర విసర్జనకు వెళ్తుండగా ముగ్గురు వ్యక్తులు పల్సర్ వాహనంపై వచ్చి కొట్టి డబ్బులు లాక్కున్నారన్నారు. మరో రూ.5 వేలు ఇవ్వాలని బెదిరించారన్నారు. దోపిడీకి పాల్పడిన వారిలో రౌడీషీటర్ శ్రీను, ఆటో డ్రైవర్ శివ, యశ్వంత్‌లను భీమిలి క్రైం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

వాహనాల వేగ నియంత్రణకు చర్యలు



సాగర్‌నగర్ వద్ద ఏర్పాటు చేసిన స్పీడ్ బ్రేకర్లు

కొమ్మాది: భీమిలి బీచ్ రోడ్డు తిమ్మాపురం నుండి గుడ్లవానిపాలెం వరకు వెళ్లే ప్రధాన రహదారిలో ఇటీవల రోడ్డు ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయి. వాహనాల అతి వేగమే ప్రమాదానికి కారణమని గుర్తించిన అధికారులు వేగానికి కళ్లెం వేసే చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో ఆరిలోవ ట్రాఫిక్ సీఐ ప్రసాద్ ఆధ్వర్యంలో పలు చోట్ల స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేశారు. రుషికొండ, రాడిసన్ బ్లూ, సాగర్‌నగర్, గుడ్లవానిపాలెం రహదారి ప్రాంతాల్లో ఈ స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేశారు.

అంధ కళాకారులకు విద్యార్థుల చేయూత



పాఠశాలలో పాటలు పాడుతున్న అంధ కళాకారులు

తగరపువలస: జీవీఎంసీ రెండోవార్డు రామన్నపేట సాయి రవీంద్ర పాఠశాల విద్యార్థులు, యాజమాన్యం మంగళవారం రాగనేత్ర బ్లైండ్ ఆర్కెస్ట్రా కళాకారులకు చేయూత అందించారు. ఆర్కెస్ట్రా కళాకారులు జాతీయ, దేశభక్తి గీతాలు పాడి అలరించారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులు కళాకారులకు ఆర్థిక సాయం అందించారు. కరస్పాండెంట్ బోగెల కృష్ణ, ప్రిన్సిపాల్ వాండ్రాసి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు యోగా శిక్షణ



గంభీరం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులతో ఆసనాలు వేయిస్తున్న గంగాధరరావు

తగరపువలస: ఆనందపురం మండలం గంభీరం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు విజయనగరానికి చెందిన యోగా ఇన్‌స్ట్రక్టర్ జాడే గంగాధరరావు మంగళవారం యోగాలో శిక్షణ ఇచ్చారు. ప్రాణాయామం, యోగాసనాలు వేయడం వలన రోజంతా ఉల్లాసంగా ఉండటంతో పాటు శారీరక, మానసిక ఆరోగ్యంతో ఉంటారన్నారు. ప్రధానోపాధ్యాయుడు యూవీవీ ప్రసాదరావు మాట్లాడుతూ విద్యార్థులకు యోగా, ధ్యానం అవసరమన్నారు. పాఠశాల సిబ్బంది గంగాధరరావును సన్మానించారు. ఉపాధ్యాయులు రామకృష్ణ, లక్ష్మి పాల్గొన్నారు.

చిట్టివలస జ్యూట్‌మిల్లు సమస్యలపై చర్చలు

తగరపువలస: చిట్టివలస జ్యూట్‌మిల్లు సమస్యలపై ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు మిల్లు యజమాని బజోరియా, కార్మిక సంఘాల నాయకులతో ఎంవీపీ కాలనీలోని తన కార్యాలయంలో సమావేశమయ్యారు. ఉద్యోగులకు రావలసిన బకాయిలు చెల్లించానికి బజోరియా అంగీకరించారు. పీఎఫ్, గ్రాట్యుటీ తదితర అంశాలకు సంబంధించి ఆయా శాఖల అధికారులతో చర్చించి నిర్ణయం తీసుకోనున్నామన్నారు. క్వార్టర్స్‌లో ఉంటున్న కార్మికులతో పాటు ఉద్యోగుల నుంచి సేకరించిన డిపాజిట్లు తిరిగి చెల్లించాలని ఎమ్మెల్యే సూచించారు. రెండు రోజుల్లో అసిస్టెంట్ లేబర్ కమిషనర్‌ను ఇరుపక్షాలు కలిసి అవగాహనకు రావాలన్నారు. ఉద్యోగుల తరపున కాకర్లపూడి వరహాలరాజు, పడాల రమణ, అల్లు బాబూరావు, చిలకా నరసింగరావు, దేవుళ్లు, రామారావు పాల్గొన్నారు.

SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
రీజనల్ బిజినెస్ ఆఫీస్-3, విశాఖపట్నం -530003

లీజుపై వసతి కావలెను

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, రీజనల్ బిజినెస్ ఆఫీస్-3, విశాఖపట్నం వారి MINI RACPC - చిట్టివలస బ్రాంచ్ ప్రత్యామ్నాయ ప్రాంగణంలోకి మార్చుటకొరకు లీజు ప్రాతిపదికన వాణిజ్య/ ఆఫీస్ ప్రాంగణముల కోసం యజమానులు/ పవర్ ఆఫ్ అటార్నీ హోల్డర్ల నుండి రెండు బిడ్ సిస్టమ్‌లో [illegible] సీల్డు టెండర్లు కోరబడుచున్నారు. ఏరియా సుమారుగా 372 చ.మీ. (4000 చ.అ.) గ్రౌండ్ ఫ్లోర్‌కు ప్రాధాన్యత. ప్రాధాన్యత ప్రదేశం: మధురవాడ మరియు పరిసర ప్రాంతములలో ఆసక్తిగల పార్టీలు వారు టెండరు ఫారంను బ్యాంకు వారి వెబ్‌సైట్ https://bank.sbi/web/sbi-in-the-news/procurement-news నుండి డౌన్‌లోడ్ చేసుకొనవచ్చును. పూర్తిచేసిన టెండర్లు సీల్డు కవరులో రీజనల్ మేనేజర్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, రీజనల్ బిజినెస్ ఆఫీస్-3, 2వ ఫ్లోర్, బాలాజీనగర్, సిరిపురం, విశాఖపట్నం -530003 వారికి ది.01-03-2025 మ. 3.00 గం.ల వరకు అందునట్లు దాఖలు చేయవలెను.

ప్రదేశం: విశాఖపట్నం, తేది: 11-02-2025 — రీజనల్ మేనేజర్

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

భీమిలి
9912220753

Office mail : sakshiadvtvsp@gmail.com